సాక్షి చిత్తూరు

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



లక్కు.. కిక్కు

చిత్తూరు జిల్లాలో సోమవారం లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించనున్నారు. అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



పడకేసిన ప్రాథమిక వైద్యం

చిత్తూరు జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యం పడకేసింది. వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారు. - 8లో



కక్షసాధింపులు తగవు

చిరుద్యోగులపై చంద్రబాబు కక్ష సాధింపులు తగవని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అధికారులు కూడా తప్పని సరిగా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు పాత డీపీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. సోమవారం జరగాల్సిన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో మంగళవారానికి వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

16న గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న డీఈఐసీ సెంటర్‌లో ఈ నెల 16న తిరుపతి బర్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రహణమొర్రి పిల్లలకు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి తెలిపారు. ఇక్కడ ఎంపికైన పిల్లలకు ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్/కార్వేటినగరం: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ, సహాయ సాంఘిక సంక్షేమాధికారి డి.శ్రీనివాసులు తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డీఎస్సీ పరీక్షకు హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు టెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. అందులో అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు www.jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని డీడీ కోరారు.

మంగపతి.. మంగళం.. జయ మంగళం







తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం సందర్భంగా శ్రీవారి పుష్కరిణిలో అశేష భక్తజనం (ఇన్‌సెట్) శ్రీ చక్రం, మలయప్పస్వామి

చక్రానికి పూజలు చేస్తున్న అర్చకులు

కష్టాలు కకావికలం కావాలని.. దుఃఖాలు దూది పింజల్లా కొట్టుకుపోవాలని.. బాధల బరువు దిగిపోవాలని కోనేటిలో తడిసి తరించడానికి తండోప తండాలుగా తరలివచ్చిన భక్తజనం.. సుదర్శన చక్ర స్పర్శతో పవిత్రమైన పుష్కరిణి జలం.. స్నానమాచరించి జనకోటి పునీతం. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం ఘట్టం వైభవంగా సాగింది. రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తం అయ్యాయి.

- ఘనంగా స్నపన తిరుమంజనం
- ఆగమోక్తంగా చక్రస్నానం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ శ్రీ భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిపారు. తొలుత విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తులు, దశ శాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం తదితర పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టీటీడీ వేదపారాయణదారులు పారాయణం చేశారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను పెద్ద జీయంగార్, చిన్న జీయంగార్లు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

ఘనంగా చక్రస్నానం

తొమ్మిది రోజుల ఉత్సవాల్లో జరిగిన అన్ని సేవలూ సఫలమై, లోకం క్షేమంగా ఉండడానికి, భక్తులు సుఖశాంతులతో ఉండడానికి చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవాలు ఒక యజ్ఞం అయినందున యజ్ఞాంతంలో అవభృథస్నానం చేస్తారు. యజ్ఞ నిర్వహణంలో జరిగిన చిన్నచిన్న లోపాలతో కలిగే దుష్పరిణామాలు తొలగి, అన్ని సంపూర్ణ ఫలాలు చేకూరడం కోసం చేసే దీక్షాంతస్నానం అవభృథం. చక్రస్నానం (అవభృథం)లో శ్రీవారి సుదర్శన చక్రానికి (చక్రత్తాళ్వార్‌కు) పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో స్నానం చేయించారు. ఆ దివ్యాయుధ స్పర్శతో పవిత్రమైన పుష్కరిణి జలంలో భక్తసమూహం మునిగి పునీతులయ్యారు. ఈ ఉత్సవాలు చేసినవారికి, చేయించినవారికి, ఇందుకు సహకరించినవారికీ, దర్శించిన వారికీ అందరికీ ఈ ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుంది.

ఆగమోక్తంగా ధ్వజావరోహణం

చక్రస్నానం నాటి సాయంకాలం ధ్వజావరోహణం నిర్వహించారు. ఇంతటితో బ్రహ్మోత్సవయజ్ఞం ముగిసింది. ఎవరైతే బ్రహ్మోత్సవాల్లో పాలు పంచుకుంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధన,ధాన్య సమృద్ధితో తులతూగుతారు. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ధ్వజావరోహణంతో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టీటీ డీ ఈఓ శ్యామల రావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయంలో ధ్వజావరోహణం చేస్తున్న అర్చకులు



స్నపన తిరుమంజనంలో పాల్గొన్న టీటీడీ ఈఓ, అదనపు ఈఓ , జేఈఓలు

సామాన్య భక్తులకు పెద్దపీట



మాట్లాడుతున్న ఈఓ జే.శ్యామలరావు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేసినట్టు టీటీడీ ఈఓ జే.శ్యామలరావు తెలిపారు. భక్తులకు ఎలాటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందించినట్టు కొనియాడారు. టీటీడీ సిబ్బంది సంయమనంతో, ప్రణాళికా బద్ధంగా, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో సేవలందించారని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొత్తం 15 లక్షల మంది భక్తులు శ్రీవారి వాహన సేవలు వీక్షించారన్నారు. గరుడ సేవ రోజున 82,043 మంది దర్శించుకున్నట్టు పేర్కొన్నారు. 30 లక్షల లడ్డూలు విక్రయించినట్టు తెలిపారు. హుండీ కానుకలు రూ.26 కోట్లు లభించినట్టు చెప్పారు.



వాహనం మోస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు

పట్టా.. నకిలీ?

పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15 ఏళ్ల కిందట చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్, తిమ్మసముద్రం ప్రాంతంలో వేలాది మంది పేదలకు స్థలాలు ఇచ్చారు. ప్రస్తుతం వాటికి మంచి డిమాండ్ ఉంది. వాటిపై కన్నేసిన డూప్లికేట్‌గాళ్లు దొంగ పట్టాలు సృష్టించి రూ.లక్షలకు విక్రయిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఇందులో కొందరి రెవెన్యూ అధికారుల హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం 2015 నుంచి నడుస్తున్నా అధికారులు తేలికగా కొట్టిపడేస్తున్నారు.

- చిత్తూరు నగరంలోని ఓ డీకేటీ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. ఇరువారానికి చెందిన అరుణ అనే మహిళ తన తండ్రి పేరుతో ఉన్న డీకేటీ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని బ్యాంకు నుంచి లోన్ తీసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించింది. డీకేటీ భూములు రిజిస్ట్రేషన్ కావని అధికారులు చెప్పారు. ఆ ముగ్గురు వ్యక్తులు ఈ పట్టాను తాము రిజిస్ట్రేషన్ చేయిస్తామని నమ్మబలికారు. తప్పుడు రికార్డులు సృష్టించారు. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. నకిలీ సీళ్లు ముద్రించారు. దీనిపై రిజిస్ట్రార్‌కు అనుమానం రావడంతో పరిశీలన నిమిత్తం అప్పటి ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిరణ్‌కు పంపారు. ఇది తన సంతకం కాదని, ఫోర్జరీ చేశారని ఆయన తేల్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది.

- చిత్తూరు నగరానికి చెందిన సుందరయ్యకు ప్రభుత్వం 2009లో ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో ఇంటి స్థలం కేటాయిస్తూ పట్టా ఇచ్చింది. ఈ పట్టాను ముఠా సభ్యులు ఫోర్జరీ చేసి ఆ స్థలాన్ని వేరే వారికి అమ్మకానికి పెట్టారు. డూప్లికేట్ పట్టదారులు పునాదురాళ్లు వేసే సమయంలో ఈ బాగోతం బయటపడింది. దీంతో నిజమైన పట్టదారులు 2023లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో తహసీల్దార్‌గా ఉన్న కిరణ్ విచారణ చేపడితే డూప్లికేట్ పట్టాగా తేలింది. ఇవి మచ్చుకు మాత్రమే. తవ్వేకొద్దీ నకిలీ పట్టాలు వెలుగు చూస్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- చిత్తూరులో నకిలీ పట్టాల కలకలం
- గత తహసీల్దార్ సీళ్లు, సంతకాలు ఫోర్జరీ
- వందల సంఖ్యలో పట్టాలు సృష్టి
- సెంటున్నర స్థలం రూ.3 లక్షలకు విక్రయం
- 2015 నుంచి నడుస్తున్న నకిలీ పట్టాల వ్యవహారం



చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అభివృద్ధి చెందుతుండడంతో ప్రతి ఒక్కరూ ఒకటికి రెండు ఇళ్లు కట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. తక్కువ ధరకు దొరికే ప్రభుత్వ ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న డూప్లికేట్‌గాళ్లు నకిలీ పట్టాలు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రశాంత్‌నగర్ ప్రాంతంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఈ దొంగ పట్టాల వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్నారు. దీనికితోడు 2015లో తహసీల్దార్ సీళ్ల కార్యాలయం నుంచి అదృశ్యమయ్యాయి. అప్పటి నుంచి దొంగ పట్టాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆ ఒక్క సీలుతో వందల పట్టాలు సృష్టించి అమ్మేశారు. మరికొంత మంది కేటుగాళ్లు తమిళనాడులోని వేలూరులో రాజముద్ర, తహసీల్దార్, వీఆర్‌ఓల నకిలీ సీళ్లు చేయించి తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారు. ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించి బ్యాంకు లోన్లు, ప్లాట్లను భారీ విక్రయాలకు సహకరిస్తున్నారు. ఈ తరుణంలో తహసీల్దార్ సంతకాలను కూడా ఫోర్జరీ చేస్తున్నారు. ఈ విషయం బయటపడి నలుగురు వ్యక్తులు గతేడాది అరెస్ట్ అయ్యారు. ఇక ఉద్యోగ విరమణ చేసిన తహసీల్దార్లు కొంతమంది పాత పట్టాల స్థానంలో కాని, కొత్తగా ఇస్తున్న ప్లాట్ల నంబర్లు తెలుసుకుని 300కు పైగా పట్టాలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు.. వసూళ్లు..

ఒక అక్రమ పట్టా సృష్టిస్తే కేటుగాళ్లకు రూ.లక్ష ముడుతోంది. ప్రశాంత్‌నగర్, బోడిగుట్ట ప్రాంతాల్లో ఒక ప్లాట్‌కు రెండు పట్టాలు ఉండడం గొడవకు దారితీస్తోంది. కొంత మంది కర్రలు, రాడ్లతో కొట్టుకుని పోలీస్ స్టేషన్ వరకు వెళ్లారు. ఆ తరుణంలో రెవెన్యూ అధికారులు స్టేషన్‌కు వెళ్లి ఏది డూప్లికేటు, ఒరిజినల్ అనేది తేల్చుతున్నారు. ఇలాంటి కేసులు అధికారుల దృష్టికి పదుల సంఖ్యలో రాగా మిగిలినవి స్థానికంగానే సర్దుబాటు వుతున్నాయి. భూమిని చూపించి పట్టా ఇస్తే రూ.3 లక్షలు, ఆ పట్టాకు రిజిస్ట్రేషన్ చేయిస్తే రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. పట్టాలకు సీళ్ల వేయిస్తే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్నారు. తహసీల్దార్ సంతకాన్ని అచ్చుగుద్దినట్లు పెడితే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు గుంజుతున్నారు. ఇందులో కొందరు రెవెన్యూ అధికారుల పాత్ర కీలకంగా ఉందని ఆ శాఖ అధికారులే విమర్శిస్తున్నారు.

పట్టించుకుంటారా..?

ఈ దొంగ పట్టాల వ్యవహారం బహిర్గతమైనా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. డొంక కదిలిస్తే.. తీగ లాగాల్సి వస్తుందని అధికారులు తలదూర్చడం లేదు. మనకెందుకొచ్చిన గొడవ అంటూ దొంగ పట్టాల వ్యవహారాన్ని తోసి పుచ్చుతున్నారు. ఇటీవల జరిగిన ఓ పట్టాల పంచాయతీ కూడా అధికారులకు తలనొప్పిని తెచ్చిపెడుతోంది. కొన్ని అక్కడికక్కడికే సెటిల్‌మెంట్ అవుతున్నాయి. ఉన్నతాధికారులు కల్పించుకుంటే తప్ప ఈ అక్రమ పట్టాల బాగోతానికి అడ్డుకట్ట పడదని పలువురు చెబుతున్నారు.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం



డూప్లికేట్ పట్టాలు ఉన్నట్టు మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. కేసులు కూడా పెడతాం. అలాంటి సమస్యలు వచ్చినప్పుడు కచ్చితంగా స్పందిస్తాం. బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. సీళ్ల మాయమైన విషయం మాకు తెలియదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. పట్టుబడితే క్రిమినల్ కేసులు పెడతాం.

-కళావతి, తహసీల్దార్, చిత్తూరు అర్బన్

రాజరాజేశ్వరిగా బోయకొండ గంగమ్మ



చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులను అనుగ్రహించారు. ముందుగా అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకు తోరణాలు, రంగు రంగుల పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద ఉభయదారులతో గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు, ఊంజల్ సేవ, గణపతి హోమం, చండీ హోమం చేశారు. దీంతో దసరా మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం, వేదపండితులు గోవర్ధనశర్మ, విశ్వనాథశర్మ, అర్చక బృందం తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 30 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. భక్తుల రద్దీతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఎక్కడా ఎవరికీ అసౌకర్యం కలుగకుండా ఈఓ పర్యవేక్షించారు. వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ స్తంభించినది. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నేటి నుంచి 16 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 9491077356 ఏర్పాటు



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సోమవారం నుంచి 16 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పూరిగుడిసెల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలని తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాలకు క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు తలెత్తితే సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రజలు 9491077356కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు. చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ప్రాంతాలతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్, పంచాయతీ శాఖ అధికారులను ఆదేశించారు. పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ అత్యవసర పరిస్థితుల్లో తగినంత స్టాక్, గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ చెరువులు, వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. చెరువులు, కుంటల వద్దకు పిల్లలు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని తల్లిదండ్రులను కోరారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను సోమవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వసంతవాణి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్‌లో ఉన్న పుట్టిన తేదీని తెలుపుతూ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని చెప్పారు. తిరుపతి జిల్లాలో నిర్వహించే పోటీలకు సంబంధించి ఆ జిల్లా సెక్రటరీ బాబు 9490620292, అన్నమయ్య జిల్లాలో వసంత 9010534818 నంబర్లలో సంప్రదించాలన్నారు. అండర్ 14 క్రీడా పోటీలకు 2011 జనవరి 1, అండర్ 17 పోటీలకు 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 8328644568లో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన ఖాదర్‌బాష

గంగవరం: మండలంలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరుకు చెందిన ఖాదర్‌బాష(54) మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. గండ్రాజుపల్లి వద్ద మందులు అందజేసి కారులో తిరుగు ప్రయాణంలో బాలాజీ భవన్ హోటల్ వద్ద ఆగాడు. కారును అక్కడే వదిలి రోడ్డు క్రాస్ చేసి హోటల్ వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో బెంగళూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఖాదర్‌బాషా తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారున్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్కు.. కిక్కు

ఎన్నికల్లో చెప్పినట్టే కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ మద్యాన్ని ఏరులై పారించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా నూతన మద్యం పాలసీని తీసుకువచ్చింది. సర్కారు దుకాణాలను తొలగించి ప్రైవేట్ షాపులను ఏర్పాటుచేయనుంది. ఈ క్రమంలోనే దరఖాస్తులు స్వీకరించింది. ఎంత పెట్టుబడి పెట్టినా నష్టం వాటిల్లని ఏకైక వ్యాపారం మద్యం వ్యాపారమని తెలుసుకున్న చాలా మంది సామాన్యులు సైతం దరఖాస్తులు వేశారు. ఎందరు కోటీశ్వరులు అవుతారో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ఈ సారి వారి అదృష్ట కిక్కు ఏ మేరకు ఉందో పరీక్షించుకోనున్నారు.

- నేడే మద్యం దుకాణాలకు లాటరీ
- జిల్లాలో 104 దుకాణాలకు 2266 దరఖాస్తులు
- అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ఆందోళన
- దుకాణం రాకుంటే 2162 మందికి రూ.2 లక్షల చొప్పున క్షవరం
- 16 నుంచి ప్రైవేటు మద్యం విక్రయాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో 104 ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్సులు జారీ చేయడానికి ఈ నెల 1న కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గడువు ముగిసేనాటికి 2,266 దరఖాస్తులు అందాయి. అంటే సగటున ఒక్కో దుకాణానికి 22 దరఖాస్తులు పడ్డాయి. దీంతో మద్యం వ్యాపారులకు కేటాయించిన టోకెన్లను లాటరీ పద్ధతిలో డిప్ తీసి దుకాణాలు కేటాయిస్తారు. ఈ మేరకు సోమవారం లాటరీ తీయడానికి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



మద్యంషాపు

ఏటా రూ.వేల కోట్ల ఆదాయం

జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడం ద్వారానే ప్రభుత్వానికి రూ.22.66 కోట్ల ఆదాయం సమకూరింది. దరఖాస్తు చేసుకున్న వ్యాపారులు ఒక్కో అప్లికేషన్‌కు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ కింద చెల్లించాలనే నిబంధనతో రూ.22.66 కోట్లు, 14 ప్రైవేట్ మద్యం దుకాణాలకు ఏటా సగటున రూ.60 లక్షల వరకు లైసెన్స్ ఫీజు వసూలు చేయనున్నారు. దీంతో రూ.62 కోట్ల ఆదాయం రానుంది. ఇవే కాకుండా మద్యం సరఫరా ద్వారా రూ.1,500 కోట్ల వరకు ఆదాయం రానుంది. ఇలా ఏటా జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.1600 కోట్ల వరకు ఆదాయం సమకూరినట్టే.

ఏర్పాట్ల పరిశీలన

చిత్తూరు నగరం సంతపేటలోని ఆర్‌ఆర్‌గార్డెన్స్‌లో సోమవారం మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ తీయనున్నారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదివారం రాత్రి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బంది, సమస్యలు లేకుండా లాటరీ ప్రక్రియ జరగాలని ఆదేశించారు.

16 నుంచి మద్యం విక్రయాలు

లాటరీ ప్రక్రియ పూర్తయి దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఈ నెల 16 నుంచి కొత్త పాలసీ ప్రకారం మద్యం విక్రయాలు చేపట్టాలి. డిప్ వేసే చోట దుకాణం వచ్చిన వ్యాపారి లైసెన్స్ ఫీజు మొత్తంలో ఆరో వంతు అప్పటికప్పుడే చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని మిగిలిన ఐదు వాయిదాల్లో చెల్లించాలి. లేకుంటే రెండు, మూడో టోకెన్ వచ్చిన వారికి దుకాణాలు ఇచ్చేస్తారు. ఇక లాటరీలో దుకాణాలు రానివారికి రూ.21.62 కోట్లు పోయినట్టే.

దుకాణాల్లో అధిక రేట్లకు విక్రయాలు

మరో వైపు జిల్లాలో ఇప్పటికే ఉన్న మద్యం దుకాణాల్లో కొందరు ఇష్టానుసారం రేట్లు పెంచి మద్యాన్ని బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారు. చిత్తూరు నగరంలోని చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదని మద్యం ప్రియులు వాపోతున్నారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపులు తగవు

- ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న కూటమికి గుణపాఠం తప్పదు
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం/పాలసముద్రం : 'ఎన్నికల హామీలు నెరవేర్చడం చేతకాని సీఎం చంద్రబాబు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొట్టేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ఆరోపించారు. ఆయన ఆదివారం పచ్చికాపల్లం, పాలసముద్రంలో విలేకరులతో మాట్లాడారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ అని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఉద్యోగులను తొలగించేందుకు పూనుకోవడం విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వం వేధింపులు, కక్ష సాధింపులతో గ్రామీణ స్థాయి నుంచి ఐఏఎస్‌ల స్థాయి వరకు ఉద్యోగులు నలిగిపోతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క ఉద్యోగినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. ప్రస్తుతం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ప్రతిపక్ష పార్టీపై ఉన్న అక్కసును అధికారులపై రుద్ది వారిని ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు, ఆశా వర్కర్లను బెదిరించడం ఎంత వరకు సబబన్నారు. చివరికి గ్రీన్ అంబాసిడర్లపైనా తమ ప్రతాపాన్ని చూపుతున్నారని ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లాలో 150 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపై హైకోర్టు స్టే విధించినా సిగ్గురాలేదని దుయ్యబట్టారు. రెడ్ బుక్ కాదని, తాము గుడ్ బుక్ రాస్తున్నామని, ప్రజలకు మంచి చేసే వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలకు వేసిన టెండర్ల ద్వారా టీడీపీ నాయకుల అరాచకాలు బట్టబయలయ్యాయని పేర్కొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ అన్బలగన్, మండల కన్వీనర్ తులసీయాదవ్, ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ గాలి మహేష్, మునస్వామి నాయుడు, పుత్తూరు కేశవరెడ్డి, గురుప్రసాద్, పోలయ్య, షణ్ముగరెడ్డి, గోపాల్ ఉన్నారు.

చిత్తూరులో భవనం కూల్చివేతపై వివాదం


కూల్చేసిన భవనం శిథిలాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో భవనం కూలివేత ఘటన టీడీపీ నేతల మధ్య ఉన్న విభేదాలు బయటపడ్డాయి. శాంతిభద్రతల సమస్య నెలకొనడంతోపాటు రోడ్డుపై హైడ్రామా నడిచింది. నగరంలోని చర్చి వీధిలో ఒక భవనానికి సంబంధించి టీడీపీ మాజీ మేయర్ హేమలత కుటుంబానికి, రవి అనే వ్యక్తికి మధ్య వివాదం ఉంది. దీనిపై కోర్టులో కేసు కూడా నడుస్తోంది. భవనం పాతది కావడంతో దాన్ని కూల్చాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది భవనాన్ని ఆదివారం కూల్చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మేయర్, టీడీపీ నేత అనురాధ, కఠారి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. భవనం కూల్చే అధికారం ఎవరికీ లేదని, తమకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఓసారి వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించాలని కోరగా ఎమ్మెల్యే తిరస్కరించారు. స్థలంపై పొజిషన్ తీసుకోవడానికి రవి, కఠారి కుటుంబం ప్రయత్నించగా హైడ్రామా నడిచింది. పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. రోడ్డుపై ఇరువర్గాలు పెద్ద ఎత్తున గుమికూడడంతో ఏమి జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందారు. మాజీ మేయర్ హేమలత మీడియాతో మాట్లాడుతూ కోర్టులో నడుస్తున్న కేసుపై కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ పాలనలో కూడా తమను ఇలా మానసికంగా వేధించలేదని తెలిపారు. ఎవరి కళ్లలో ఆనందం చూడడానికి ఇలా చేస్తున్నారని ప్రశ్నించారు. దీనికి బాధ్యులు కోర్టులో సమాధానం చెప్పాలన్నారు. అనంతరం ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

సదుం: దళితుడిపై దాడి చేసిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్‌షావలి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సదుం మండలంలోని ఊటుపల్లె పంచాయతీ మద్దెలవారిపల్లెకు చెందిన సురేంద్రపై తుమ్మగుంటపల్లెకు చెందిన ఒక మహిళ మరో ముగ్గురితో కలిసి భూవివాదాల నేపథ్యంలో దాడి చేసినట్లు తెలిపారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేశాడని తెలపారు. ఈ మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఐచర్ వాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బంగారుపాళెం : మండలంలోని మొగిలిఘాట్ సమీపంలోని దొరచెరువు వద్ద శనివారం సాయంత్రం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఐచర్ వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయ పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరులో నివాసముంటున్న మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు కారులో తిరుమల బయలుదేరారు. బంగారుపాళెం మండలం దొరచెరువు వద్ద స్పీడ్ బ్రేకర్లను దాటుతున్న ఐచర్ వాహనాన్ని వెనుక వైపున కారు ఢీకొంది. దీంతో కారులో ఉన్న మల్లికార్జునరెడ్డి, అతని కుమార్తె ప్రవల్లిక తీవ్రంగా గాయపడ్డారు. భార్య అశ్విని, కుమారుడు ప్రజ్ఞక్కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రవల్లికను వేలూరు సీఎంసీకి పంపించారు. కేసు దర్యాప్తులో ఉంది.



పడకేసిన ప్రాథమిక వైద్యం

గ్రామాల ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు మధ్యాహ్నం 12 గంటలు కూడా కాకుండానే వెళ్లిపోతున్నారు. కొంత మంది విధులకు హాజరుకాకుండా మేనేజ్ చేస్తున్నారు. సొంత ప్రాక్టీసుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఓపీల సంఖ్య దారుణంగా పడిపోతోంది. ఫలితంగా పేదలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కవుతున్నాయి. వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఈ విషయం తెలిసినా జిల్లా ఉన్నతాధికారులు పట్టీనట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

- విధులకు డుమ్మా కొడుతున్న వైద్య సిబ్బంది
- సొంత ప్రాక్టీసుకు ప్రాధాన్యం
- వెలవెలబోతున్న పీహెచ్‌సీలు
- రోగులకు తప్పని తిప్పలు
- తగ్గిపోతున్న ఓపీల సంఖ్య
- పట్టించుకోని అధికారులు


ఆరిమాకులపల్లి పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీ

- శ్రీరంగరాజుపురం మండలం ఆరిమాకులపల్లి పీహెచ్‌సీని శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్ తనిఖీ చేశారు. అక్కడ 14 మందికి గాను ఒక స్టాఫ్ నర్సు, అటెండర్, వాచ్‌మెన్ మాత్రమే ఉన్నారు. దీనిపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శ్రీరంగరాజుపురం పీహెచ్‌సీ వైద్యులు హుటాహుటినా పరుగెత్తికొచ్చారు. మిగిలిన వారు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆఫీసులో జరిగే మీటింగ్‌కు వెళ్లినట్టు తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో పారిశుద్ధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇదొక్కటే కాదు.. పలు పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లతో కలిపి 14 మంది చొప్పున పనిచేయాల్సి ఉంది. ఇందులో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, సీహెచ్‌ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) ఎఫ్‌ఎన్‌ఓ(ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ), శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మెన్, ఇద్దరు ఎంపీహెచ్‌ఎస్(మల్టీపర్పస్ సూపర్‌వైజర్స్)లు, పీహెచ్‌ఎన్(పబ్లిక్ హెల్త్ నర్స్)–హెల్త్ ఎడ్యుకేటర్, సీనియర్ అసిస్టెంట్‌లు ఉన్నారు. వీరు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు విధిగా పనిచేయాలి. ఆ తర్వాత ఒక స్టాఫ్ నర్సు డ్యూటీ చేయాల్సి ఉంది. వీరిలో చాలా మంది విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలా వచ్చి వెళ్లిపోతున్నారు

సమయానికి విధులకు రావాల్సిన పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది డ్యూటీలకు పంగనామాలు పెడుతున్నారు. డ్యూటీ సమయం ఉదయం 9 గంటలైతే గంట.. గంటన్నర ఆలస్యంగా వస్తున్నారు. ఆపై కొందరు అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారు. మరికొందరు మధ్యాహ్నం వరకు ఉండి తర్వాత మెల్లగా జారుకుంటున్నారు. ఇంకొందరు పూర్తిగా వైద్య సేవలకు డుమ్మా కొడుతున్నారు. సొంత ప్రాక్టీస్‌లకు వెళ్లిపోతున్నారు. యూనియన్ పేర్లు చెప్పుకొని చాలామంది విధులను వదిలించుకుంటున్నారు. మీటింగ్ పేర్లతోనూ ఇష్టానుసారంగా వెళ్లిపోతున్నారు. దీంతో పలు పీహెచ్‌సీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. డాక్టర్లు విధులకు రానిచోట సిబ్బందే రోగులకు మందు బిల్లలు రాసి పంపుతున్నారు.

తగ్గిపోతున్న ఓపీల సంఖ్య

మూడు నెలలుగా పీహెచ్‌సీల్లో సేవలు గాడితప్పాయి. వైద్యుల నిరసనతో సమయపాలన పూర్తిగా కొరవడింది. ఆ తర్వాత కూడా కొంతమంది డాక్టర్లు విధులపై దృష్టి సారించడం లేదు. దీని దెబ్బకు సిబ్బంది కూడా చేతులెత్తేస్తున్నారు. విధుల నుంచి తప్పించుకు తిరుగుతున్నారు. ఈ కారణంగా ఓపీల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. పీహెచ్‌లకు వచ్చే రోగులు వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కొందరైతే పీహెచ్‌సీలే దిక్కుగా డాక్టర్లు, సిబ్బంది వచ్చేంత వరకు పడిగాపులు కాస్తున్నారు. గతంలో ప్రతి పీహెచ్‌సీలోనూ ఓపీలు 100 నుంచి 150పైగా ఉండేవి. ఇప్పుడు చాలాచోట్ల ఓపీల సంఖ్య వందలోపే ఉంటున్నాయి. అయినా ఆ శాఖ ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని పదేపదే ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం వద్దు. డాక్టర్ల స్థానంలో వేరే వాళ్లు చికిత్స చేస్తే కేసులు నమోదు చేస్తాం. డ్యూటీ టైంలో విధుల్లోనే ఉండాలి. రాత్రి పూట కూడా విధుల్లో ఉండాలి. అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారంటే కచ్చితంగా పరిశీలిస్తాం. నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం. మీటింగ్‌ల సాకు చూపి ఇష్టానుసారంగా తిరగడం కరెక్ట్ కాదు.

– ప్రభావతిదేవి, జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి, చిత్తూరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేసింది. డాక్టర్లే పల్లె బాట పట్టి వైద్యం చేసేలా చర్యలు చేపట్టింది. తొలుత పీహెచ్‌సీలకు ఇద్దరు డాక్టర్లను నియమించింది. వారంలో రెండు రోజులు స్పెషలిస్ట్ ద్వారా పీహెచ్‌సీల్లో వైద్యం అందించింది. పల్లెలోనే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి స్థానికంగానే వైద్య సేవలను అందించేందుకు పాటుపడింది. 104 వాహనాల ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను అందిస్తూ వచ్చింది. 14 రకాల పరీక్షలు, 165 వరకు మందులు, మాత్రలను అందజేసింది. పీహెచ్‌సీలను 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుంది. నాడు నేడుతో పీహెచ్‌సీల రూపురేఖలు మార్చేసింది. డాక్టర్లతో పాటు 14 మంది వైద్య సిబ్బందిని నియమించింది. ల్యాబ్‌లో సంబంధిత మెషిన్లు ఏర్పాటుచేసింది. వైద్యులు విధులకు డుమ్మా కొట్టకుండా ఫేషియల్ అటెండెన్స్‌ను తీసుకువచ్చింది. నేడు ఆ పరిస్థితి లేదు. డాక్టర్లు, సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు , శోభన్‌బాబు

వి.కోట: మండలంలోని ఆకువారుపల్లి నుంచి నడిపేపల్లికి వెళ్లే రోడ్డులో ఆదివారం ఆటో– బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గోనుమాకులపల్లి గ్రామానికి చెందిన కన్నప్ప కుమారుడు శ్రీనివాసులు (50), మునెప్ప కుమారుడు శోభన్‌బాబు (22) బైక్‌లో వెళుతున్నారు. మండలంలోని నడిపేపల్లి– ఆకువారిపల్లి రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆటో ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొంది. శ్రీనివాసులు, శోభన్‌బాబు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 ద్వారా వి.కోట సీహెచ్‌సీకి తరలించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

రామకుప్పం: మండలంలోని చెల్దిగానిపల్లి పొలాల్లో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. వారి నుంచి రూ.17,650 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దాడుల్లో రామకుప్పం ఇన్‌చార్జి ఎస్‌ఐలు నరేష్, శ్రీనివాసులు, బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతపై దౌర్జన్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడిపై తెలుగు తమ్ముళ్లు దౌర్జన్యం చేశారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. వివరాల్లోకెళితే.. దేవాంగుల ఇలవేల్పు చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు పులి రామచంద్ర కుటుంబ సభ్యులతో వచ్చారు. అదే సమయంలో మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు ముత్యాల సారథి అక్కడికి వచ్చారు. పులి రామచంద్ర కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు. దీంతో పులి రామచంద్ర, ముత్యాల సారథి మధ్య తోపులాట జరిగింది. పులి రామచంద్ర మాట్లాడుతూ తమ కుల దైవాన్ని దర్శించుకోవడానికి వస్తే ముత్యాల పార్థసారథి, అతని సోదరుడు కృష్ణ, మచ్చ విజయ్, పట్టెం జగదీష్ తమపై దాడి చేశారన్నారు. తమ కుటుంబ సభ్యులను దుర్భాషలాడి తన అన్న పులి నాగార్జునపై దాడి చేశారని తెలిపారు. ముత్యాల సారథిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని వాపోయారు.

న్యాయవాదులపై టీడీపీ గూండాల స్వైరవిహారం

తిరుపతి లీగల్: తిరుపతిలో టీడీపీ నాయకులు మరోసారి రెచ్చిపోయారు. న్యాయవాదులపై మారణాయుధాలతో దాడికి యత్నించి, వారి కార్యాలయాలను ధ్వంసం చేసిన ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. సీనియర్ న్యాయవాదులు ముక్కు సత్యవంతుడు, మునిభాస్కర్, రమేష్‌రెడ్డి, మధుసూదనరావు, మరికొందరు న్యాయవాదుల కథనం మేరకు.. మిట్టపాళెంకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తికి తిరుపతి ప్రకాశం రోడ్డులో మూడంతస్తుల భవనం ఉంది. ఆ భవనంలో సీనియర్ న్యాయవాది ముక్కు సత్యవంతుడు 30 ఏళ్లకుపైగా ఓ గదిని అద్దెకు తీసుకుని కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు సీనియర్ న్యాయవాదులు గుర్రప్పనాయుడు, మధుసూదనరావు, రమేష్‌రెడ్డి, మునిభాస్కర్ తదితరులు వేర్వేరు గదులను అద్దెకు తీసుకుని కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. తిరుపతి నగర టీడీపీ అధ్యక్షుడు శంకరనారాయణ (చినబాబు) శనివారం 20 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, గూండాలతో న్యాయవాదుల కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. ఆ భవనం ముందున్న ప్రహరీ గోడను తొలగించి, న్యాయవాదులు అద్దెకు తీసుకున్న గదులను వెంటనే ఖాళీ చేయాలంటూ మారణాయుధాలతో దాడికి యత్నించారు. భయభ్రాంతులకు గురైన న్యాయవాదులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడికి చేరుకుని టీడీపీ నేత చినబాబు, కార్యకర్తలను తరిమేశారు. న్యాయవాదులైతే తమకేంటని టీడీపీ నేత చినబాబు గూండాలతో తమ కార్యాలయంపై దాడి చేశారని సీనియర్ న్యాయవాది ముక్కు సత్యవంతుడు వాపోయారు. తమ కార్యాలయాలను ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమంటే ఇబ్బంది అని, కొంత సమయం ఇస్తే ఖాళీ చేస్తామంటూ గతంలోనే భవన యజమానికి చెప్పామని తెలిపారు. చినబాబు తమపై మారణాయుధాలతో దాడి చేయించాల్సిన అవసరం ఎందుకొచ్చిందో అర్థం కావడం లేదని వాపోయారు. గతంలో రైల్వే స్టేషన్ సమీపంలో కూడా భవనాలను ఇలాగే దౌర్జన్యంగా ఖాళీ చేయించినట్టు చెప్పారు.

చినబాబును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలి

తిరుపతిలో న్యాయవాదులపై దౌర్జన్యం చేసిన శంకర్ నారాయణ అలియాస్ చిన్న బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సీనియర్ న్యాయవాది, జనసేన పార్టీ రాయలసీమ కన్వీనర్ ముక్కు సత్తివంతుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి ప్రశాంత నగరమని, ఇక్కడ రౌడీయిజం చెల్లదని పేర్కొన్నారు. ఈ దౌర్జన్యాన్ని జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇదిలా వుండగా ఆదివారం జనసేన నాయకులు కిరణ్ రాయల్, కార్యకర్తలు సీనియర్ న్యాయవాది ముక్కు సత్యవంతుడు కార్యాలయాన్ని ఇతర న్యాయవాదుల కార్యాలయాలను పరిశీలించారు.

